# ఏడాదిగా ఇఫ్లూ వీసీ పోస్టు ఖాళీ

## ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్న వైనం

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ) దేశంలోనే విదేశీ భాషల బోధనకు ఏర్పడ్డ తొలి యూనివర్సిటీ. ఇంతటి ప్రఖ్యాతిగాంచిన వర్సిటీ పరిస్థితి.. నాయకుడు లేని నావలా తయారైంది. ఏడాది నుంచి ఈ వర్సిటీ వీసీ పోస్టు ఖాళీగా ఉంటున్నది. రెగ్యులర్ వీసీని నియమించకుండా ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు. ఇఫ్లూ వీసీగా ఉన్న ప్రొఫెసర్ సురేశ్‌కుమార్ పదవీకాలం 2023 డిసెంబర్‌లో ముగియగా, ప్రస్తుతం ప్రొఫెసర్ హరిబండి లక్ష్మి ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతున్నారు. వీసీ పోస్టు ఖాళీతో వర్సిటీ పాలన గాడితప్పిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# గోదావరి ఒడ్డున పెద్దపులి సంచారం

- ములుగు నుంచి పినపాక అడువుల్లోకి ప్రవేశం
- పాదముద్రల ఆధారంగా అధికారుల గుర్తింపు

హైదరాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొద్దిరోజుల క్రితం కలకలం సృష్టించిన పెద్దపులి తాజాగా ములుగు జిల్లాలో ప్రత్యక్షమైంది. వెంకటాపురం మండలంలోని భోదపురం, ఆలుబాక, తిప్పాపురం, సీతారాంపురం, రామచంద్రపురం గ్రామాల పరిసరాల్లో పులి గాండ్రింపులు విన్నట్టు స్థానికులు చెప్పడంతో అటవీ అధికారులు రంగంలోకి దిగారు. పాదముద్రల ఆధారంగా దాని కదలికలను గుర్తించారు. మంగపేట, తాడ్వాయి అడవుల్లో సంచరించిన ఈ పులి చుంచుపల్లి మీదుగా మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి గుట్టవైపు వెళ్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక అడవుల్లో ప్రవేశించినట్టు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ ట్రాప్ కెమెరాలను అమర్చడంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఒంటరిగా అడవుల్లోకి వెళ్లవద్దని ప్రజలకు, పశువుల కాపరులకు సూచించారు. ఎవరికైనా పులి కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

















